సాక్షి ఒడిశా

గురువారం । 10 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ.4,35,172

బంగారం: 150 మిల్లీ గ్రాములు

వెండి: 750 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

గోపబంధు రాష్ట్రానికి వర పుత్రుడు

ఉత్కళ మణి గోప బంధు దాస్ రాష్ట్రానికి వర పుత్రుడని సీఎం మోహన్‌చరణ్ మాఝీ అన్నారు.



- IIలో▸



ప్రతి ఒక్కరికీ న్యాయమే లక్ష్యం

ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయసేవ ప్రదీకరణ ప్రధాన లక్ష్యమని కొరాపుట్ జిల్లా లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన అన్నారు. - IIలో▸

న్యూస్‌రీల్

బాల్య వివాహాలపై అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జయపురం: బాల్య వివాహాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు జయపురం పారాబెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'బాల్య వివాహం వద్దు – పాఠశాల ముద్దు' అనే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈనెల 11వ తేదీన అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వక్తృత్వ, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రంలో బీడీవో శక్తి మహాపాత్రో, తహసీల్దార్ సవ్య సాయి జెన తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



సన్మాన గ్రహీతలతో సమాజం సభ్యులు

రాయగడ: స్థానిక కోదండ రామ మందిరంలో మహా సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉత్కళాంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ ఏర్పాటు చేసిన భక్తి సంగీత విభావరి అలరించింది. అనంతరం గాయిని కొల్లూరు లక్ష్మీ శేష సాయి, గాయకులు పులఖండండం గణపతి శాస్త్రి, కె.గౌరీ ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రేజేటి శ్రీరామ శర్మ, బుర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



సోహిత్ కోటి మృతదేహం

పర్లాకిమిడి: జిల్లా కేంద్రానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాటికోట గ్రామం వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో సెంచూరియన్ వర్సిటీలో బీటెక్ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. వర్సిటీలో చదువుతున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులు పాటికోట నుంచి పర్లాకిమిడికి బుల్లెట్‌పై మితిమీరిన వేగంతో వస్తుండగా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లారు. దీంతో వాహనాన్ని డ్రైవింగ్ చేస్తున్న విద్యార్థి సోహిత్ కోటి (22) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మరో విద్యార్థి రాహుల్‌కు తీవ్ర గాయాలవ్వడంతో పర్లాకిమిడి ఆస్పత్రిలో చేర్పించినట్లు గురండి పోలీసు అధికారి రవీంద్ర పాత్రో వెల్లడించారు. మృతి చెందిన విద్యార్థి పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన వ్యక్తికి పేర్కొన్నారు. మృతుడి బంధువులకు పోలీసులు సమాచారం అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రమేష్ చంద్ర జెనా అరెస్టు

భువనేశ్వర్: రాష్ట్ర పంచాయతీ రాజ్, తాగునీటి విభాగం సీనియర్ ప్రైవేటు కార్యదర్శి (సీనియర్ గ్రేడ్) రమేష్ చంద్ర జెనాని రాష్ట్ర విజిలెన్స్ వర్గాలు బుధవారం అరెస్టు చేశారు. లెక్కకు మిక్కిలిగా ఆస్తుల్ని అక్రమంగా ఆర్జించినట్లు విజిలెన్స్ వర్గాలు ధ్రువీకరించిన మేరకు ఈ చర్యని చేపట్టారు. విజిలెన్స్ వర్గాలు నిర్వహించిన సోదాల్లో భువనేశ్వర్ 2 బహుళ అంతస్తు భవనాలు, భువనేశ్వర్‌లో 4, కోణార్కు ప్రాంతంలో ఒకటి వంతున మొత్తం 5 ఇండ్ల స్థలాలు, ఒక విలాసవంతమైన కారు ఉన్నట్లు గుర్తించారు. మరో వైపు ప్రభుత్వ క్వార్టరుకి నెలకు రూ.12,000కి అద్దెకి ఇచ్చినట్లు విజిలెన్సు వర్గాలు ధ్రువీకరించాయి.

మాజీ ఎమ్మెల్యే ధనేశ్వర్ మృతి



ధనేశ్వర్ (ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ మాజీ సభ్యుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ధనేశ్వర్ మాఝి (83) కన్నుమూశారు. ఛాతీ నొప్పి రావడంతో బుధవారం ఉదయం ఆయన స్వస్థలం కెసింగాలో ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆయన మృతి చెందినట్లు ప్రకటించారు. కలహండి జిల్లా నొర్లా నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా 5 సార్లు రాష్ట్ర శాసన సభకు ఎన్నికై ప్రాతినిధ్యం వహించారు. రాజ్యసభ సభ్యునిగా కొనసాగారు. దీర్ఘ కాలం బిజు జనతా దళ్ అభ్యర్థిగా ప్రత్యక్ష రాజకీయాల్లో తనదైన ఉనికిని సాధించారు. ఇటీవల పార్టీ ఫిరాయించి భారతీయ జనతా పార్టీలో చేరారు. ఆయన మృతిపై పలువురు నాయకులు, ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆయన స్వగృహంలో అంతిమ దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు.

- అర్హులైన ప్రతీ మహిళకు రూ.5 వేలు
- తొలి విడతలో జమకాని వారికి నిధులు విడుదల
- సీఎం మోహన్ చరణ్ మాఝీ



చెక్కు అందజేస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ

60 లక్షల మందికి.. సుభద్ర యోజన



మాట్లాడుతున్న సీఎం మోహన్

భువనేశ్వర్: రాష్ట్రంలో మొత్తం 60 మంది బ్యాంక్ ఖాతాలకు సుభద్ర యోజన ద్వారా నగదు జమ చేసినట్లు సీఎం మోహన్ చరణ్ మఝీ తెలియజేశారు. మయూర్‌భంజ్ జిల్లా బరిపద చౌ మైదానంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తొలి విడతలో నమోదవ్వని వారికి నిధులను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వాయిదా కింద రూ.1,750 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారు. అర్హులైన ప్రతీతి మహిళకు రూ.5 వేలు చొప్పున నగదు బదిలీ అవుతుందన్నారు. రాష్ట్ర మహిళలకు ఇది దసరా కానుకగా అభివర్ణించారు. అర్హులైన ప్రతీ మహిళ పొదుపు ఖాతాకు ఏటా 2 వాయిదాల్లో రూ.10 వేలు చొప్పున నగదు బదిలీ అవుతుందన్నారు. రాఖీ పూర్ణిమ మరియు అంతర్జాతీయ మహిళా దినం పురస్కరించుకుని ఒక్కో వాయిదా మొత్తం విడుదల చేస్తారు. ఇలా ఈ ఏడాది ఆరంభమైన సుభద్ర పథకం 2028–29 ఆర్థిక సంవత్సరం వరకు 5 ఏళ్లపాటు నిరవధికంగా కొనసాగుతుంది. సుభద్ర పథకం నిర్వహణ కోసం బడ్జెటులో ఈ ఏడాది రూ.55,825 కోట్ల నిధులు కేటాయించారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని బీజేపీ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ మహిళకు తమ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేసి సాధికారిత బలోపేతానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మహిళా – శిశు అభివృద్ధి శాఖ మంత్రి ప్రభాతి పరిడా పాల్గొన్నారు. ఈ పథకం తొలి విడత విడుదల పురస్కరించుకుని 25 లక్షల 11 వేల మంది లబ్ధిదారుల ఖాతాలకు నగదు ప్రత్యక్షంగా బదిలీ చేశారు. మలి వాయిదా కింద సుమారు మరో 35 లక్షల మంది లబ్ధిదారుల్ని అర్హులుగా ఖరారు చేశారు. వీరందరి ఖాతాలకు తొలి వాయిదా తరహాలో నగదు బదిలీ అవుతుంది. బుధ వారం సాయంత్రం సరికి సమగ్రంగా 60 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాలకు సుభద్ర పథకం కింద నిధులు బదిలీ అవుతాయని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా సభాముఖంగా ప్రకటించారు.



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ప్రజల పార్టీ బీజేడీ

- మాజీ సీఎం నవీన్ పట్నాయక్



సభ్యత్వ నమోదు రెన్యువల్ పత్రాన్ని చూపిస్తున్న నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: బీజేడీ ప్రజల పార్టీ అని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. ఉత్కళ మణి గోప బంధు దాస్ జయంతి పురస్కరించుకుని బిజూ జనతా దళ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధ వారం ప్రారంభించింది. ఈ సందర్భంగా స్థానిక శంఖ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ తొలుత తన సభ్యత్వాన్ని నవీకరించుకుని అనుబంధ పత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ప్రజలపై సేవాభావ దృక్పథంతో ప్రతి కార్యకర్త ముంగిట సకాలంలో ప్రత్యక్షమయ్యే సత్సంప్రదాయం బీజేడీ ఆవిష్కరణగా పేర్కొన్నారు. బీజేడీ ఆవిష్కరించిన పలు ప్రజా పథకాలు ఇతర ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలవడం దీనికి తార్కాణంగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పలు బీజేడీ పథకాలను అమలు జేసిందన్నారు. రాష్ట్ర ప్రజల హృదయాల్లో బీజేడీ స్థానం ఎప్పటికీ సుస్థిరమని పేర్కొన్నారు. అధికార కాంక్షకు అతీతంగా విపక్ష హోదాలో బాధ్యతాయుతమైన ప్రజల పార్టీగా నిరంతరం సేవా కార్యక్రమాల్లో బీజేడీ కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. మాతృ భూమి ఒడిశా సేవకులుగా బీజేడీ కార్యకర్తలు గర్వపడాలని అభినందించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



పిండి వంటల ప్రదర్శన

రాయగడ: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారీ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. గత కొద్దికాలంగా పరీక్షల ఫలితాల్లో బాలికలదే పైచేయి అవుతుండడం హర్షణీయమన్నారు. క్రీడలు, చదువు తదితర అంశాల్లో రాణిస్తుండడం గర్వకారణమని పేర్కొన్నారు. అయితే కొన్ని కుటుంబాల్లో ఇప్పటికీ బాలకలపై చిన్నచూపు చూస్తుండడం సరికాదన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి మాట్లాడుతూ.. బాలికలు ఉన్నతంగా చదువుకొని దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిపొందిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే ఎస్‌హెచ్‌జీ బృందానికి చెందిన మహిళలు పౌష్టికాహారానికి సంబంధించిన ప్రదర్శన ఏర్పాటు చేశారు.

వందే భారత్ నడపాలని విజ్ఞప్తి



ఎంపీ బలభద్రని సత్కరిస్తున్న న్యాయవాదులు

జయపురం: జగదల్‌పూర్ నుంచి పూరీ వరకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని కోట్‌పాడ్ న్యాయవాదుల సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నవరంగపూర్ ఎంపీ, కేంద్ర రైల్వే పరిచాలన కమిటీ సభ్యుడు బలభద్ర మఝికి విజ్ఞప్తి చేశారు. నవరంగపూర్ ఎంపీ బలభద్ర మఝి కేంద్ర ప్రభుత్వ రైల్వే పరిచాలన కమిటీ శాశ్వత సభ్యుడిగా నియమితుడైన తర్వాత మొదటిసారిగా ఢిల్లీ నుంచి నేరుగా బుధవారం కోట్‌పాడ్ వచ్చారు. ఈ సందర్భంగా కోట్‌పాడ్ న్యాయవాదులు ఆయనను ఘనంగా సన్మానించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడిపితే పక్కరాష్ట్ర ప్రజలతో పాటు అవిభక్త కొరాపుట్ ప్రజలు లబ్ధి పొందగలరని తెలియజేశారు. తాము ప్రధానమంత్రికి, కేంద్ర రైల్వే మంత్రికి లేఖలు రాస్తామని న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు పంక్జ కుమార్ పాత్రో వెల్లడించారు. అలాగే మల్కన్‌గిరి, నవరంగపూర్ రైలు మార్గాలను వెంటనే చేపట్టి అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయం తప్పకుండా రైల్వేమంత్రితో చర్చించగలనని ఎంపీ మఝి న్యాయవాదులకు హామీ ఇచ్చారు. కోట్‌పాడ్ న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు పంకజ కుమార్ పాత్రో నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ప్రదీప్ భక్షీ, సభ్యులు బిద్యుత్ లత ముదులి, ఎంపీ ప్రతినిధి రామేశ్వర జెన, ప్రశాంత బక్షి కళాశాల ప్రిన్సిపాల్ హేమలత ఆచార్య, అధ్యాపకులు హేమంత దొళాయి, మనోజ్ పండ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ దశలో కూలిన రక్షణ గోడ

భువనేశ్వర్: పూరీ జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న వంతెన రక్షణ గోడ కుప్పకూలింది. నిమ్మాపడా మండలం ధనువా పంచాయతీ సున్నొగొరాడి మీదుగా బొవులొపాదా, భువా ఛక్ మార్గంలో ఉన్న వంతెన కోసంఈ గోడ నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి సడక్ యోజన కింద ఈ పనులు చేపట్టారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 5 కిలోమీటర్ల పొడవున రక్షణ గోడ నిర్మాణం ప్రారంభించారు. దీని వ్యయ ప్రణాళిక రూ.5.25 కోట్లు. అయితే రక్షణ గోడ కూలడంతో వంతెన పట్టు కోల్పోయే ప్రమాదంపై పరిసర ప్రాంతీయులు భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందడంతో గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ ఇంజినీర్ ఘటనా స్థలం ప్రత్యక్షంగా సందర్శించారు. రక్షణ గోడ కూలడంతో కొంతమంది గాయపడినట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఈ సంఘటనపై విచారణకు ఆదేశించినట్లు ఆయన ప్రకటించారు.

వేధింపులతో యువతి ఆత్మహత్య



నిప్పు అంటించుకున్న రాణి

మల్కన్‌గిరి:

గంజాం జిల్లా కుకూడాఖండి పంచాయతీలో సవతి తల్లి, తండ్రి వేధింపులు తాళలేక ఒక యువతి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చిన యువతి రాణి ప్రధాన్(20) సవతి తల్లితో గొడవపడింది. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చి పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుంది. వారు తనను వేధిస్తుండడం వలనే ఆత్మహత్య చేసుకుంటున్నానని అరుస్తూ పంచాయతీ కార్యాలయం ఎదుట స్పృహతప్పి పడిపోయింది. వెంటనే స్థానికులు మంటలను ఆర్పి బరంపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. పోలీసు సూపరింటెండెంట్ తెలిపిన వివరాల మేరకు.. రాణి మూడేళ్ల వయస్సులో తల్లి చనిపోవడంతో తండ్రి మరో పెళ్లి చేసుకున్నాడు. అయితే తల్లిలేని పిల్లను సవతి తల్లి సరిగా చూసుకోలేదు. అయినప్పటికీ గ్రాడ్యుయేషన్ వరకు చదుకుంది. కానీ చదవడం సవతి తల్లికి ఇష్టం లేకపోవడంతో ఇటీవల వేధింపులు పెరిగాయి. దీంతో ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• సైబర్ ఫ్రాడ్ మనీ రిటర్న్ మేళా



బాధితులకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న పీడిత వర్గాలు కోల్పోయిన నగదుని వారికి అందించారు. దీనిలో భాగంగా జంట నగరాల పోలీసు కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో బుధవారం సైబర్ ఫ్రాడ్ మనీ రిటర్న్ మేళ కార్యక్రమం నిర్వహించారు. పలు రకాల మాధ్యమాల్లో ప్రజల సొమ్మును గల్లంతు చేసి సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో నిబంధనల మేరకు ఫిర్యాదు నమోదు చేసి సైబర్ నేరాల నియంత్రణ విభాగం దృష్టికి తీసుకొచ్చిన వారి సొమ్ము వెనుకకు రప్పించి ఫిరాయించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్లు దోచుకున్న రూ.49 లక్షలు పీడిత వర్గాలకు ఫిరాయించారు.

☛ సత్వర చర్యలకు పిలుపు

సైబర్ నేరగాళ్ల మోసాల్లో చిక్కుకున్న మరు క్షణమే సైబర్ నేరాల నియంత్రణ వర్గం దృష్టికి తీసుకురావాలని అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేస్తే ప్రభావిత లావాదేవీ నిలిపివేయడం సులభతరం అవుతుందన్నారు. సందిగ్ధ సైబర్ మోసానికి సంబంధించి సమాచారాన్ని http:// sancharsaathi. gov. in చక్షు విభాగానికి తెలియజేయాలని తెలిపారు.

ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- కొత్త ప్రణాళికలతో ముందుకెళ్దాం
- కార్యకర్తలకు నెక్కంటి హితవు



సమావేశంలో ప్రసంగిస్తున్న నెక్కంటి

రాయగడ: అధికారం లేదని ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, కొత్త ప్రణాళికలతో ప్రజల వద్దకు వెళ్లి వారి ఆదరణ పొందేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని బీజేడీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక హోటల్ తేజస్వీ గ్రౌండ్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సభ్యత్వ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పుడు ప్రచారాలు చేసుకుని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని ఆవేదన వ్యక్తం చేశారు. 120 రోజుల బీజేపీ పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారన్నారు. ఉచిత విద్యుత్ వంటి హామీలు అడ్డంగా పెట్టుకుని అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీని ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

☛ గత రెండు దశాబ్దాల్లో అభివృద్ధి

గత రెండు దశాబ్దాల బీజేడీ పాలనలో మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిదని నెక్కంటి అన్నారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించే విషయంలో ఎంతో పురోగతిని సాధించామని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ ప్రజల ఆదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేసిన నవీన్ పట్నాయక్ వంటి నాయకుడు ఈ రాష్ట్రానికి అవసరమన్నారు. అటువంటి నాయకుడిని మనమంతా ఇటువంటి గడ్డుకాలంలో అండగా నిలవాలని కార్యకర్తలకు సూచించారు. ఆయన నాయకత్వాన్ని బలపరిచేందుకు విస్తృతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నవీన్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో 120 రోజుల బీజేపీ పాలనలో ఎంతో వెనుకబడిందని పేర్కొన్నారు.

☛ మనస్పర్థలు వీడండి

పార్టీలో మనస్పర్థలు వీడి పార్టీ సమైఖ్యతకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని నెక్కంటి అన్నారు. నవీన్ పట్నాయక్ పిలుపు మేరకు ప్రతీ ఒక్కరూ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చురుగ్గా చేయాలని అన్నారు. జిల్లా, మండల, సమితి, మున్సిపాలిటీ స్థాయిల్లో కార్యకర్తలు సమావేశాలను నిర్వహించి కొత్త సభ్యుల సేకరణకు నడుం బిగించాలన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. అనంతరం మాజీ మంత్రి జగన్నాథ సరక మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి ఏం చేయాలనే దానిపై ప్రతి ఒక్కరూ గురి పెట్టాలన్నారు. ఏది జరిగినా మన మంచికే అన్నట్లుగా వ్యవహరించి భవిష్యత్‌లో పార్టీ మనుగడ కోసం నిర్విరామంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రులు సరక, హిమిరిక తదితరులు

క్లుప్తంగా

హెచ్‌పీసీఎల్‌తో స్కిల్ డెవలప్‌మెంట్ ఒప్పందం

శ్రీకాకుళం రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చే క్రమంలో భాగంగా హెచ్‌పీసీఎల్‌తో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఒప్పందం కుదుర్చుకుందని బొల్లినేని మెడి స్కిల్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఐదు కోర్సులకు గాను జనరల్ డ్యూటీ అసిస్టెంట్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ పోర్ట్ పోలీయో మేకప్ ఆర్టిస్ట్, ఫుడ్ అండ్ బేవరేజస్ సర్వీస్ అసోసియేట్, వేర్ హౌస్ డేటా ఫీడర్, ప్రొడక్షన్ మెషన్ ఆపరేటివ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకు పదోతరగతి, ఐటీఐ చదివిన యువతీ యువకులు 18 నుంచి 28 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. మూడు నెలలు ఉచిత శిక్షణ ఉంటుందని, భోజన సదుపాయాలు ఉంటాయన్నారు.

శభాష్ వసంత



జి.సిగడాం: ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీలో జి.సిగడాం మండలం పెంట గ్రామానికి చెందిన డోల వసంతరావు ప్రతిభ చాటారు. తెలుగు ఉపాధ్యాయునిగా గ్రేడ్ -1 విభాగంలో తెలంగాణ రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించారు. గ్రేడ్ -2 విభాగంలోనూ రాష్ట్రస్థాయిలో 3 వ ర్యాంకు సాధించారు. హైదరాబాద్ డీఈఓ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో అక్కడకు బయల్దేరి వెళ్లారు.

ఆదిత్యుడిని దర్శించుకున్న రిటైర్డ్ డీజీపీ



రిటైర్డ్ డీజీపీ సుధాకర్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సిక్కిం రిటైర్డ్ డీజీపీ అత్తిలి సుధాకరరావు, యామిని దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ విశిష్టతను వివరించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచారి తదితరులున్నారు.

అన్న క్యాంటీన్‌లో కలెక్టర్ భోజనం



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్, జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శ్రీకాకుళంలోని అన్న క్యాంటీన్‌లో బుధవారం మధ్యాహ్నం భోజనం చేశారు. జిల్లా కేంద్రంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి క్యూలో సామాన్యుడిలా నిలబడి భోజనం రుచి చూశారు. అక్షయ పాత్ర నిర్వాహకులను పలు ప్రశ్నలు అడిగి కొన్ని సూచనలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న అప్పన్న

ఎల్.ఎన్.పేట: మండలంలోని బసవరాజుపేట షెడ్ సమీపంలో అలికాం-బత్తిలి (ఏబీ) రోడ్డుపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బసవరాజుపేట గ్రామానికి చెందిన సిద్ధాంతం అప్పన్నకు బలమైన గాయాలయ్యాయి. బసవరాజుపేట గ్రామానికి చెందిన అప్పన్న మంగళవారం రాత్రి సమీపంలో ఉన్న స్కాట్‌పేటలో పాలకేంద్రంలో పాలు ఇచ్చి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో అప్పన్నకు గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అప్పన్న పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

హ్యాండ్‌బాల్‌లో సిక్కోలు భళా

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జైత్రయాత్ర కొనసాగుతోంది. రాజమండ్రి వేదికగా ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) అండర్-17 బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం బాలురు జట్టు రన్నరప్‌గా నిలిచింది. జిల్లా జట్టు రాణింపుపై డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, మెట్ట తిరుపతిరావు, గురుగుబెల్లి రాజశేఖర్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తుల సులభ దర్శనానికి ప్రాధాన్యం



ఛొత్తీసా నియోగుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- శ్రీమందిరం సీఏవో అరవింద కుమార్ పాఢి

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన చతుర్ధామూర్తులను భక్తులు కనులారా తిలకించి సులభ దర్శనంతో తరించే రీతిలో సౌకర్యాలు కల్పించే యోచన క్రమంగా బలపడుతోంది. ఈ నేపథ్యంలో శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి (సీఏవో) డాక్టర్ అరవింద కుమార్ పాఢి అధ్యక్షతన ఛొత్తీసా నియోగుల సమావేశం బుధవారం జరిగింది. కార్తీక మాసం పురస్కరించుకుని నెల రోజులపాటు దేవస్థానం హబిషాలి భక్తుల తాకిడితో కిటకిటలాడుతుంటుంది. ప్రధాన దేవస్థానంలో నిత్య పూజలు, సేవాదులకు ఏమాత్రం అంతరాయం లేకుండా కార్తీక మాస వ్రతంకు అనుకూలంగా హబిషాలీలకు దర్శన సౌకర్యం, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్ధారిత వేళల ప్రకారం ముగించేందుకు ఛొత్తీసా నియోగులతో శ్రీ మందిరం పాలన యంత్రాంగం సమావేశమైంది. కార్తీక మాసం ముగియడంతో నిత్యం విచ్చేసే యాత్రికులు, భక్తులకు రత్న వేదికపై శ్రీ జగన్నాథుని సమేత చతుర్ధామూర్తుల్ని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈ సమావేశంలో తీర్మానించడం విశేషం.

కార్తీక మాసం ఏర్పాట్లు

పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని నిత్యం ఉదయం 4 గంటలకు శ్రీ మందిరం తలుపులు తెరుస్తారు. దర్శనం కోసం విచ్చేసే భక్తుల రద్దీ నియంత్రణతో సులభ దర్శనం ఏర్పాటు చేయాలని ఛొత్తీసా నియోగుల సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ఏర్పాట్లు కోసం పూరీ జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యాచరణ ఖరారు చేయనున్నారు.

ప్రత్యేక సదుపాయాలు

రత్న వేదికపై మూల విరాటులను సునాయాసంగా దర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. దూరం నుంచి భగవంతుని కనులారా దర్శించుకునేందుకు వీలుగా ర్యాంప్ ఏర్పాటు చేస్తారు. ఈ ఏర్పాటుతో భక్తులను 6 వరుసల్లో దర్శనానికి క్రమబద్ధీకరిస్తారు. ప్రధానంగా పురుషులు, మహిళలు, వయో వృద్ధులు, దివ్యాంగులు, పసి పిల్లలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏర్పాట్లు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఒడిశా వంతెన నిర్మాణ కార్పొరేషన్ ఓబీసీసీ ఈ పనులను చేపడుతుంది. ప్రాచీన కట్టడం ఏమాత్రం ప్రభావితం కాకుండా ర్యాంప్ ఇతరేతర ఏర్పాట్లు చేయడం అనివార్యంగా పేర్కొన్నారు. భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ సంప్రదింపులతో ఓబీసీసీ ఈ పనులు చేపడుతుంది.

ఏసీ నాట్య మండపం

దర్శనం సందర్భంగా శ్రీమందిరంలో ఉక్కపోత, ఉక్కిరిబిక్కిరి వంటి అసౌకర్య పరిస్థితుల నివారణకు ఎయిర్ కండిషన్ చేయాలని నిర్ణయించారు. ఏసీ చేయడంతో బాటు తొక్కిసలాట పరిస్థితులు నివారించేందుకు వరుసలు వారీగా దర్శనానికి సౌకర్యం కల్పిస్తారు. శ్రీమందిరం గరుడ స్తంభం నుంచి గర్భగుడిలో రత్న వేదికపై కొలువైన చతుర్ధామూర్తుల్ని దర్శించుకునేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేస్తారు. ఈ ఏర్పాట్లు స్వామి నిత్య సేవలు, పూజాదులకు ఆటంకం కాకుండా జాగ్రత్త వహిస్తారు. దీని కోసం తాత్కాలిక బారికేడ్లతో 6 వరుసలు దర్శనం కోసం ఏర్పాటు చేస్తారు.

గోపబంధు రాష్ట్రానికి వర పుత్రుడు



మల్కన్‌గిరి: గోపబంధు దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బలభద్ర తదితరులు



భువనేశ్వర్: గోపబంధు దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం మోహన్

- సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: ఉత్కళ మణి గోపబంధు దాస్ రాష్ట్రానికి వర పుత్రుడని సీఎం మోహన్‌చరణ్ మాఝి అన్నారు. ఆయన నిస్వార్థ ప్రజాసేవ సమాజానికి కొత్త ఒరవడి ఆవిష్కరించిందన్నారు. గోపబంధు జయంతి పురస్కరించుకుని రాష్ట్ర శాసన సభ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహం దగ్గర పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో పాటు స్పీకర్ సురమా పాఢి ఉన్నారు.

మల్కన్‌గిరి: ఉత్కళమణి గోపబంధు దాస్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని డీఐపీఆర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం కోసం గోపబంధు ఒక వ్యక్తిలా కాకుండా, శక్తి మాదిరిగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. యువత ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రకాష్‌చంద్ర పట్నాయక్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి రంజన్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు సచ్చిదానంద



జయపురం: ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర రాయపూర్‌లో జరగనున్న 27వ జాతీయ స్థాయి అటవీ విభాగ స్పోర్ట్స్ మీట్‌లో జయపురం అటవీ రేంజర్ సచ్చిదానంద పరిడ రాష్ట్రం నుంచి పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఆయన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలో రాష్ట్రం నుంచి పాల్గొనున్నారు. దీంతో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

జిల్లా జైలులో ఖైదీ మృతి

భువనేశ్వర్: బర్‌గడ్ జిల్లా జైలులో ఖైదీ మృతి చెందాడు. అతని మరణం అనుమానాస్పదం అయింది. మృతుడు బర్‌గడ్ జిల్లా పాయికమల్ మండలం ప్రకాష్‌పూర్ గ్రామస్తుడు 26 ఏళ్ల యువకుడు మనోజ్ పాయికాగా గుర్తించారు. అక్రమ సారా విక్రయం కేసులో నిందితుడు. నేర నిర్ధారణ విచారణ జరుగుతుండగా న్యాయస్థానంలో అస్వస్థతకు గురయ్యాడు. తక్షణమే స్థానిక ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు.

జెడ్పీ సమావేశం ప్రశ్నలపై సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆస్పత్రులకు సంబంధించి అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనలు పంపినట్లు సంబంధిత సభ్యులకు తెలపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యాధికారులను ఆదేశించారు. ఆగస్టు 28వ తేదీన నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన బుధవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఆమదాలవలస, పాతపట్నం, టెక్కలి, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఆస్పత్రుల ఆధునికీకరణపై ప్రశ్నించగా.. ప్రతిపాదనలు పంపించామని డీఎంహెచ్‌ఓ చెప్పారు. అయితే ఎమ్మెల్యేలకు సమాచారం అందిస్తే వారు సమన్వయం చేసుకుంటారని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖపై ఎరువుల పంపిణీ, ఎంత ఎరువులు అవసరం ఉందని కలెక్టర్ అడుగగా 13 వేల మెట్రిక్ టన్నుల అవసరం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. రబీపై ఆరా తీశారు. తులగాం ఆర్‌ఆర్ కాలనీలో ఉపాధి హామీ నియామకాల ప్రకారం గుర్తించాలని డ్వామా పీడీ సుధాకర్‌ను ఆదేశించారు.

ఇదేం న్యాయం..?

- తమ ఉద్యోగాల తొలగింపుపై 31 మంది ఆందోళన
- రాష్ట్రంలో ఎక్కడా లేని రూల్స్ ఇక్కడే ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్న



డీఎంహెచ్‌ఓ కార్యాలయం

అరసవల్లి: మూడేళ్ల కిందట అన్యాయంగా తమను ఉద్యోగాల నుంచి తీసేశారని, కేవలం ఉన్నతాధికారుల వల్లనే తమ కొలువులు పోయాయని, అప్పటి నుంచి పోరాడుతున్నా కీలక అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని వైద్య శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కోవిడ్ కాలం, ఆ తర్వాత సమయాల్లో జరిగిన ఉద్యోగాల నియామకం, తొలగింపుల్లో 31 మంది అన్యాయమైపోయారు. అప్పటి నుంచి వారు ఈ సమస్యపై పోరాడుతూనే ఉన్నారు.

అసలేం జరిగిందంటే..

జిల్లాలో నిహాల్ ఏజెన్సీ (మొదటి కాంట్రాక్ట్) ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో 2020 మే నెలలో ఉన్న ఖాళీల మేరకు తాత్కాలికంగా మొత్తం 71 పోస్టులను భర్తీ చేశారు. ఇందులో 21 పోస్టులను డీఎంహెచ్‌ఓ పరిధిలోని పీహెచ్‌సీల్లో భర్తీ చేస్తే.. మిగిలిన 50 పోస్టులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఏపీ వైద్యవిధానపరిషత్, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో కేటాయించారు. అలాగే 2020 జూలైలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ విధానంలో సుమారు 330 మందిని జిల్లాలో వైద్యులతో పాటు ఎఫ్ఎన్ఓలు, ఎంఎన్ఓలు, తదితర స్టాఫ్‌లను నియమించారు. ఇవన్నీ తాత్కాలిక నియామకాలేనని, తర్వాత అందరినీ తొలగించేస్తామని ముందుగానే చెప్పి నియమించుకున్నారు. నిబంధనల మేరకు వీరంతా ఏడాది పనిచేసి వెళ్లిపోయారు. సెప్టెంబర్ 2021లోనే వీరి తొలగింపులు కూడా జరిగిపోయాయి. అయితే అదే సమయంలో 21 మంది నర్సింగ్ సిబ్బందిని, మరో 10 మంది అదనపు సిబ్బందిని నిహాల్ ఏజెన్సీ రెండో కాంట్రాక్ట్ ద్వారా నియమించేలా జీఓ 62, జీఓ 60లను వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జారీ చేశారు. వీరిని శాశ్వత ఔట్‌సోర్సింగ్ కింద గుర్తించాలని, వీరిని తొలగించేందుకు లేదని అప్పట్లోనే ప్రభుత్వం సూచించింది. కానీ జిల్లా అధికారులు మాత్రం గుంపగుత్తగా ముందుగా నియమించిన 71 మంది, ఆ తర్వాత వచ్చిన 330తో కలిపి వీరిని కూడా ఉద్యోగాల నుంచి తీసేశారు. వాస్తవానికి జీఓ 60, 62 ద్వారా నియమితులైన వారిని రాష్ట్రంలో ఎక్కడా తొలగించలేదు. కానీ మన జిల్లాలో మాత్రం తొలగించడంతో వీరు ఆందోళన చేశారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించామని, తమను శాశ్వత సిబ్బందిగా నియమిస్తే ఎలా తొలగిస్తారంటూ ప్రశ్నించారు. కానీ వారు మొర విన్నవారే లేకపోయారు.

కోర్టును ఆశ్రయిస్తే..

తమకు జరిగిన అన్యాయంపై వీరంతా కోర్టును ఆశ్రయించారు. తాము 2020 జూన్‌లో కోర్టును ఆశ్రయిస్తే.. ప్రతివాదులు నియామకాల సమయంలోని నోట్ ఆర్డర్‌ను మార్చేసి కోర్టుకు సమర్పించినట్లు వారు ఆరోపిస్తున్నారు. దీంతో తమ నియామకాల సమయంలోని నోట్ ఆర్డర్‌ను సమాచార హక్కు చట్టం కింద ఇవ్వాలంటూ గత 27న అడిగితే ఇంతవరకు జిల్లా వైద్యారోగ్య శాఖ నుంచి స్పందనే లేదని వారు చెబుతున్నారు. కేవలం తమ స్వలాభం కోసం తమ నియామకాలను ఫేక్ ఆర్డర్లుగా చూపించే ప్రయత్నం చేసి తమ వారిని నియమించుకునేలా పావులు కదుపుతున్నారని ఆరోపించారు. దీని వెనుక ఓ కీలక అధికారి ఉన్నట్లు చెబుతున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని తమ సమస్య పరిష్కరించాలని బాధితులు తండ్యాల సుధాబాబు, రూపవతి, కుమారి, అచ్యుతరావు, బండి రమాదేవి తదితర కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



డీఎంహెచ్‌ఓ గది ముందు కోర్టు ఆదేశాల పత్రాలను చూపిస్తున్న బాధితులు సుధాబాబు తదితరులు

నిరాహార దీక్షలకు సిద్ధం

మాకు అన్యాయం జరిగింది. కేవలం మౌఖిక ఆదేశాల ప్రకారం ఎలాంటి రిటన్ ఆర్డర్ లేకుండా మమ్మల్ని తొలిగించారు. డీఎంహెచ్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్, డీఎంహెచ్ఓ మీనాక్షి తదితరులు న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇందుకు నిరసనగా త్వరలో డీఎంహెచ్ఓ కార్యాలయం ముందే నిరాహార దీక్షలకు దిగుతాం.

– తండ్యాల సుధాబాబు, బాధితుడు (ఎంఎన్ఓ)

ముగిసిన వాలీబాల్ పోటీలు



ట్రోఫీ అందుకుంటున్న అనుగుల్ జిల్లా జట్టు



ట్రోఫీలతో అనుగుల్, ఢెంకనాల్, నువాపడ, కేంద్రపడా జిల్లాల క్రీడాకారులు



కేంద్రపడ బాలికల జట్టుతో అధికారులు

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి విద్యాలయాల సమూహ వాలీబాల్ పోటీలు (అండర్ 14, అండర్ 17) పర్లాకిమిడిలో బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కలెక్టర్ బిజయకుమార్ దాస్ మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో అండర్-14 గ్రూపు బాలుర విభాగంలో అనుగుల్ జిల్లా విజేతగా, రన్నర్‌గా ఢెంకనాల్ జిల్లా నిలిచాయి. బాలికల విభాగంలో ఢెంకనాల్ జిల్లా జట్టు విజేతకాగా, నువాపడా జిల్లా రన్నర్‌గా నిలిచాయి. అండర్-17 బాలుర విభాగంలో విన్నర్‌గా కేంద్రపడా జిల్లా, రన్నర్‌గా అనుగుల్ జిల్లా, బాలికల విభాగంలో కేంద్రపడా విజేతగా, రన్నర్‌గా ఢెంకనాల్ జిల్లా గ్రూపు నిలిచారు. విజేతలకు జిల్లా కలెక్టర్ బిజయకుమార్ దాస్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖాధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి, విద్యాశాఖ క్రీడాధికారి సురేంద్ర కుమార్‌పాత్రో, క్రీడా శిక్షాయిత్రిలు ప్రియదర్శి మిశ్రా, తపస్వినీ పండా, రేఖారాణి దేవ్, దర్శితా పట్నాయిక్, క్రీడాశిక్షకులు లింగరాజు సామల్, ధీరజ్ సామల్, ఈశ్వర్ సామల్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలకు జన్మనిచ్చిన తల్లులు ధన్యులు



విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ బిజయ కుమార్

పర్లాకిమిడి: ఆడ పిల్లలకు జన్మనిచ్చిన తల్లులు ధన్యులని కలెక్టర్ బిజయ కుమార్‌దాస్ అన్నారు. పర్లాకిమిడి మహిళా ప్లస్ టూ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆడ పిల్లలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందని, బాలికలు ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా స్థాయిలో బాలికలు, మహిళ సంక్షేమం కోసం సేవలందిస్తున్న ఆరుగురు మహిళా నాయకులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో డీసీపీయూ అరుణ్ కుమార్ పట్నాయక్, ప్రిన్సిపాల్ డా.మహేంద్ర రోయితో తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



పర్లాకిమిడి: అమ్మవారికి సాయంత్ర హారతి ఇస్తున్న దృశ్యం



రాయగడ: జగన్నాథ మందిరం సమీపంలో...



రాయగడ: కస్తూరీ నగర్‌లో...

రాయగడ: శరన్నవరాత్రుల్లో భాగంగా ఏడోరోజు బుధవారం సరస్వతీ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక కస్తూరీ నగర్‌లోని శ్రీసత్యనారాయణ ఆలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా అమ్మవారిని సరస్వతీ రూపంలో అలంకరించారు. అదేవిధంగా మెయిన్ రోడ్డు జగన్నాథ మందిరం సమీపంలోని గణపతి ఆలయంలో సరస్వతి రూపంలో అమ్మవారిని అలంకరించి, వేద పండితులు మావుదూరు కిషోర్, రేజేటి శ్రీరామ శర్మలు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

పర్లాకిమిడి: పట్టణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా గ్రామ దేవత నీలమ్మ గుడిలో సాయంత్ర హారతికి అనేక మంది భక్తులు విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళల దాండియా నృత్యం అలరించింది.

ప్రతి ఒక్కరికీ న్యాయమే లక్ష్యం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

జయపురం: ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయసేవ ప్రదీకరణ ప్రధాన లక్ష్యమని కొరాపుట్ జిల్లా న్యాయసేవ ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన అన్నారు. జయపురం సమితి ఉమ్మిరి గ్రామంలో బుధవారం నిర్వహించిన పంచాయతీ స్థాయి లీగల్ సర్వీస్ డెస్క్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. గత 10 రోజులుగా శిక్షితులైన పారాలీగల్ స్వచ్ఛ సేవికలు గ్రామంలో పర్యటించి వివిధ పథకాలకు అర్హులైన వారినుంచి దరఖాస్తులు స్వీకరించారు.

క్లుప్తంగా

ఎన్‌సీసీ అధికారి పర్యటన

విజయనగరం రూరల్: ప్రతి ఒక్కరి జీవితంలో ఎన్‌సీసీ అనేది మంచి నడవడిక నేర్పుతుందని ఉభయరాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీ.ఎం.రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన కోరుకొండ సైనికపాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలిసి వారితో ముచ్చటించారు. ఎన్‌సీసీతో పాటు రక్షణ రంగంలో ఎలా ప్రవేశం పొందవచ్చో, అలాగే వాటి ప్రాముఖ్యత ఎలా ఉంటుందో విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు.అనంతరం పాఠశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణను పరిశీలించారు.

పీజీటీ కెమిస్ట్రీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: భామినిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ కెమిస్ట్రీ ఒక పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 వ తేదీలోగా ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పీజీ ఇన్ కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీలో కనీసం 50 శాతం మార్కులు, గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఈడీ, సీటెట్ పేపర్ 2లో ఉత్తీర్ణత, టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఆంగ్లమాధ్యమం బోధనలో ప్రావీణ్యం ఉండాలని స్పష్టం చేశారు.

పాముకాటుతో రైతు మృతి

రేగిడి: మండలంలోని నాయిరాలవలస గ్రామానికి చెందిన రైతు రుంకు దుర్గారావు పాముకాటుకు గురై మృతిచెందాడు. దీనిపై కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దుర్గారావు ఈనెల 8న తన పొలంలో మేతగడ్డి కోసేందుకు సాయంత్రం వెళ్లగా, దారిలో పాము కాలిపై కాటువేసింది. దీంతో గట్టిగా కేకలు వేయగా, పక్కన పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి వచ్చి 108లో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ వైద్యం అందిస్తుండగానే మంగళవారం అర్ధరాత్రి సమయంలో మృతిచెందాడు. మృతునికి భార్య నారాయణమ్మతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు మృతిచెందడంతో కుటుంబసభ్యులు భోరున విలపిస్తున్నారు. ఆ రైతు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీటీసీ కొవ్వాడ శ్రీరాములు, వావిలపల్లి వెంకటరమణ తదితరులు పరామర్శించారు.

వివాహిత ఆత్మహత్య

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన ఊడిగల కుమారి ఆత్మహత్యకు పాల్పడింది. వసాది గ్రామానికి చెందిన చిన్న అనే వ్యక్తితో కొన్నేళ్ల క్రితం కుమారికి వివాహం జరిగింది. వివాహమైన నాలుగేళ్ల తర్వాత భర్తతో కలిసి కన్నవారి గ్రామం పెదవేమలి వచ్చేసింది. దంపతులిద్దరూ ఇక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొద్ది నెలలుగా ఆమె కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ నెల 7వ తేదీన కడుపు నొప్పి రావడంతో భరించలేక పురుగుమందు తాగేసింది. దీంతో కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందింది. బుధవారం పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. మృతిరాలికి భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

గంజాయి కేసులో ఎనిమిది మంది అరెస్ట్



నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్సై గణేష్

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణాను కూకటివేళ్లతో నియంత్రించి, సరఫరా చేస్తున్న నిందితులను అరెస్టు చేయాలనే సంకల్పంతో ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఎప్పటికప్పుడు ఇస్తున్న ఆదేశాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఈ సందర్భంగా బుధవారం నెల్లిమర్ల మండల కేంద్రంలోని చంపావతి నదీ పరీవాహక ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న, వినియోగిస్తున్న ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఎనిమిది కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్‌లను నెల్లిమర్ల పోలీసులు సీజ్ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం మాట్లాడుతూ అరెస్టు చేసిన గంజాయి నిందితుల్లో అనకాపల్లి జిల్లా, చోడవరం గ్రామానికి చెందిన సురభి పార్థసారథి (ఎ1), జ్యోతుల బద్రినాథ్(ఎ2), అల్లూరి సీతారాజు జిల్లా, పాడేరు మండలానికి చెందిన కొర్ర భాస్కరరావు(ఎ3), కృష్ణాజిల్లా కానూరు గ్రామానికి చెందిన గుంటూరు తేజ (ఎ4), నెల్లిమర్ల మండలం దివకుల పేటకు చెందిన కురుమనెల్లి గణేష్ (ఎ5), విశాఖ సిటీ శివాజీపాలానికి చెందిన డొప్ప అనుదీప్ (ఎ6), విశాఖ సిటీ పాండురంగాపురానికి చెందిన సామిరెడ్డి రఘుచరణ్ (ఎ7),విజయనగరం శివాలయం వీధికి చెందిన అంధవరపు ఈశ్వరరావు (ఎ8)లు ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులు పార్థసారథి, బద్రినాథ్‌లకు కొర్ర భాస్కరరావు గంజాయి సరఫరా చేసేవాడని విచారణలో వెల్లడైందన్నారు.



సామూహిక అక్షరాభ్యాసాలకు చిన్నారులతో పాటు హాజరైన తల్లిదండ్రులు





అమ్మవారిని చూపిస్తూ అక్షరాలను దిద్దమంటున్న అర్చకులు

సరస్వతీ నమస్తుభ్యం..!

విజయనగరం రింగురోడ్డు సమీపంలోని ఎస్‌వీఎస్ నగర్‌లో ఉన్న జ్ఞానసరస్వతీ ఆలయంలో బుధవారం అక్షర మంత్రం ప్రతిధ్వనించింది. మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని చదువుల తల్లి సమక్షంలో పిల్లలతో తల్లిదండ్రులు అక్షరాలు దిద్దించారు. అక్షరమంత్రోపదేశం చేశారు. శారదా సేవా సంఘం అధ్యక్ష్య, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావుల పర్యవేక్షణలో సాగిన సామూహిక అక్షరాభ్యాసాలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది తమ పిల్లలతో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాయి. సాయంత్రం అమ్మవారిని సూర్య ప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం జరిపారు.

– విజయనగరం టౌన్

చేపల పెంపకానికి చేయూత


- ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారులకు రాయితీలు
- ఎస్టీ మత్స్యకార రైతులకు 60 శాతం..
- జీసీ మత్స్యకార రైతులకు 40 శాతం రాయితీపై చేప పిల్లల పంపిణీ
- తోటపల్లి రిజర్వాయర్‌లో 10 లక్షలు
- పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 21 లక్షలు
- సీతంపేట ఐటీడీఏ పరిధిలో 14 లక్షల సీడ్ విడుదలకు కసరత్తు
- నవంబర్‌లో సీడ్ స్టాకింగ్ ప్రారంభం

పాలకొండ రూరల్:

మత్స్యకారులకు శుభవార్త. రిజర్వాయర్లు, చెరువుల్లో చేపల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం చేయూతనందిస్తోంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎస్‌వై) పథకం కింద ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు 60 శాతం, బీసీ మత్స్యకారులకు 40 శాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని తోటపల్లి, వెంగళరాయసాగర్, గుజ్జువాయి, వట్టిగెడ్డ రిజర్వాయర్లతో పాటు 109 సాగునీటి చెరువుల్లో చేపల పెంపకానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మత్స్యకారులను గుర్తించారు. చేప పొదుగు (హేచింగ్), చిచ్చుర పిల్లలు (రేగింగ్) సాకడానికి నర్సరీలు సిద్ధం చేస్తున్నారు.



సీతంపేట ఐటీడీఏ పరిధిలో సిద్ధం అవుతున్న మత్స్య సంపద



ప్రభుత్వ చేపపిల్లల పెంపకం కేంద్రం దుమ్మంగిలో సిద్ధమైన సీడ్

45 లక్షల సీడ్ విడుదలకు చర్యలు

జిల్లాలో గుమలక్ష్మీపురం మండలం దుమ్మంగి ప్రభుత్వ చేపపిల్లల పెంపకం కేంద్రం ద్వారా శత శాతం రాయితీపై ఉచితంగా 10 లక్షల కట్ల, రాగండి, ఎర్రమైల జాతులకు చెందిన చేప పిల్లలను (ఫింగర్ రింగ్స్ సైజ్ సీడ్) ఈ నెల 25వ తేదీ లోగా తోటపల్లి రిజర్వాయర్‌లో విడుదలకు రంగం సిద్ధం చేస్తున్నారు. అలాగే సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఏసీఏ, టీఎస్ఎస్ ద్వారా పాలకొండ నియోజకవర్గ పరిధిలో 15 లక్షల (బొచ్చు, రాగండి, గడ్డి, ఎర్రమైల) జాతులకు చెందిన చేప పిల్లలను 555 చెరువుల్లో విడిచిపెట్టనున్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఏసీఏ, టీఎస్ఎస్ ద్వారా 9 టీఎస్పీ మండలాల్లో 21 లక్షల చేప పిల్లల పంపిణీకి ప్రతిపాదనలు చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకుని వచ్చేనెలలో సీడ్ స్టాకింగ్ మొదలుపెట్టనున్నారు.

పీఎంఎంఎస్‌వై పథకం కింద..



పీఎంఎంఎస్‌వై పథకం కింద జిల్లాలో ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు 60 శాతం, బీసీ మత్స్యకారులకు 40 శాతం రాయితీపై చేప పిల్లల పంపిణీకి కసరత్తు ప్రారంభించాం. ఈ క్రమంలో కమిషనర్ ఆఫ్ ఫిషరీస్, కలెక్టర్ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం తెలిపిన వెంటనే నవంబర్‌లో సీడ్ స్టాకింగ్ మొదలు పెడతాం. జిల్లాలో మత్స్య సందప, ఔత్సాహిక రైతులు, సొసైటీల బలోపేతమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే రాయితీలపై అవగాహన కల్పిస్తున్నాం. గిరిజన మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం.

– వేముల తిరుపతయ్య, జిల్లా మత్స్య శాఖాధికారి, పార్వతీపురం మన్యం

జిల్లాలో మత్స్యకార సొసైటీలు	35	సొసైటీల్లో సభ్యులు సంఖ్య	4,655		
మత్స్యమిత్ర (మహిళా) సొసైటీలు	8	మహిళా సభ్యుల సంఖ్య	488		
సొసైటీ చెరువులు	110	గ్రామపంచాయతీ లీజు చెరువులు	75	రిజర్వాయర్లు	4
ప్రభుత్వ చేప పిల్లల పెంపకం కేంద్రం: దుమ్మంగి					

గంజాయి అక్రమ రవాణా అరికట్టాలి

- విశాఖ రేంజ్ ఎస్పీలతో జూమ్‌మీటింగ్‌లో డీఐజీ



విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా జరగకుండా చూడాలని, గంజాయి పండించే రైతులు జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసే విధంగా చర్యలు చేపట్టాలని విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, అల్లూరి సీతారామారాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం జిల్లాల ఎస్పీలతో బుధవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి సాగు, విక్రయాలు, రవాణా, వినియోగం చేయడం వల్ల విధించే శిక్షలు, ఎదుర్కొనే న్యాయపరమైన చిక్కులను వివరించాలని సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు సంకల్పం కార్యక్రమం ద్వారా అవగాహన చేపట్టాలని చెప్పారు. ప్రతి జిల్లాలో గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు మరింత పటిష్టంగా డైనమిక్ వాహన తనిఖీలను ఆకస్మికంగా చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటుచేసిన చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలను క్షుణ్ణంగా చేపట్టాలని, ఆధునిక సాంకేతికను, స్నిఫర్ డాగ్స్‌తో ఇప్పటికే గుర్తించిన హాట్‌స్పాట్‌ల వద్ద తనిఖీలు చేపట్టాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాకు తరచూ పాల్పడే వారిపై పీడీయాక్ట్ ప్రయోగించాలని స్పష్టం చేశారు. దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లు తనిఖీ చేసి, వారి లైసెన్స్‌లను పరిశీలించాలని, భద్రత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రేంజ్ పరిధి ఎస్పీలు

సైబర్ మోసాలపై అవగాహన

సైబర్ నేరాలను నియంత్రించడంలో భాగంగా ప్రజలకు సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించాలని డీఐజీ సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలు సైబర్ నేరాలకు గురికాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో అనకాపల్లి ఎస్పీ ఎం.దీపిక, ఏఎస్ఆర్ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్, శ్రీకాకుళం ఎస్పీ కేవీ.మహేశ్వరరెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ. మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మహిళలు ఆర్థికంగా రాణించేందుకు పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జీవనోపాధుల కార్యక్రమంపై సంబంధిత శాఖాధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) ద్వారా కొత్త పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరయ్యే కొత్త యూనిట్ల సమాచారం కోసం ఐటీడీఏ కార్యాలయంలో గల జీవనోపాధుల సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. కొత్త యూనిట్ల స్థాపనలో ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం , ఇతరులకు 15శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. పీఎం విశ్వకర్మ యోజన కింద చేతివృత్తుల కళాకారులకు తగిన శిక్షణ ఇచ్చి రూ.15వేలు విలువచేసే కిట్‌లతోపాటు కొత్త యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎంఈడీపీ, ఎల్ఈడీపీ ప్రోగ్రాంలపై శిక్షణ ఇచ్చి జీవనప్రమాణాలు మెరుగుపరుచుకునేలా చేయాలని నాబార్డ్ ఏడీఎం దినేష్‌కుమార్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. నవంబర్ 1 నాటికి అన్ని మండలాల్లో మోడల్ వీడీవీకేలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అశుతోస్ శ్రీవాత్సవ, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎంవీ.కరుణాకర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తుచర్యలు

జిల్లాలో మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని, ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలని సూచించారు. డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, డీఈఓ జి. పగడాలమ్మ, డీఎల్ఏటీఓ డా.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

దత్తిరాజేరు: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం బాడంగి మండలం పాల్తేరు గెడ్డ నుంచి అక్రమంగా దత్తి గ్రామానికి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను షికారుగంజి, రామచంద్రాపురం గ్రామాల వద్ద పట్టుకుని సీజ్ చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలు పట్టుకుని సీజ్ చేయడం జయనున్నట్లు హెచ్చరించారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

- శాస్త్రోక్తంగా జరిపించిన అర్చకులు



స్వామిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్తున్న అర్చకులు



వెండి మంటపం వద్ద వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామివారి సన్నిధిలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా జరిగింది. సాక్షాత్తు తిరుమలలో జరుగుతున్న విధంగా వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలు ఈ నెల 3 నుంచి రామతీర్థంలో కనులపండువగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, బాలభోగం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. తరువాత యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపించి స్వామివారిని రామతీర్థం తిరువీధుల్లో పల్లకిలో ఊరేగించారు. అర్చకులు గ్రామ అష్ట దిక్కులకు స్వామివారిని తీసుకువెళ్లి గ్రామ బలిహరణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించి మంగళాశాసనం కార్యక్రమం నిర్వహించారు.

కనులపండువగా కల్యాణం


బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామతీర్థం దేవస్థానం అర్చకులు వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. యాగశాలలో విశిష్ట హోమాలను జరిపించిన తరువాత స్వామివారిని ఆస్థాన మంటపంలోకి తీసుకువచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం (స్థల, దేహశుద్ధి) తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలను దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు స్వామివారికి సమర్పించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ సాయంత్రం 4గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం యజ్ఞోపవీత ధారణ చేపట్టి తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

12న చక్రస్నానం

శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 12న స్వామివారికి చక్రస్నానం కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం ఆఖరి ఘట్టమైన ధ్వజావరోహణ జరిపించి మొదటి రోజు ధ్వజస్తంభంపై ఎగురవేసిన గరుత్మంతుడు చిత్రపటాన్ని కిందకు దింపి బ్రహ్మోత్సవాలను పూర్తిచేయనున్నారు. ఇందులో భాగంగా శ్రీరామచంద్ర ప్రభువును అదే రోజు సాయంత్రం జమ్మివేటకు తీసుకువెళ్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

ముందు ‘చూపు’ అవసరం..!

- సకాలంలో వైద్యం అందితే అంధత్వం దూరం
- ప్రతి ఒక్కరికీ కంటి వ్యాధులపై అవగాహన తప్పనిసరి
- జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు
- నేడు జిల్లాలోని 37 పీహెచ్‌సీల్లో వైద్యశిబిరాలు
- గ్లకోమాపై విస్తారంగా అవగాహన కార్యక్రమాలు
- నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం



నర్సిపురం పాఠశాలలో నేత్ర పరీక్షల్లో వైద్య సిబ్బంది

పార్వతీపురంటౌన్: శరీరంలో ఏ అవయవానికి బాధ కలిగినా ఆ బాధను కళ్లే వ్యక్తపరుస్తూ ఉంటాయి. ప్రపంచంలో ప్రకృతి అందాలను కళ్లున్న ప్రతి ఒక్కరూ చూసి ఆస్వాదించి మధురాను భూతి పొందుతుంటారు. ఆ కళ్లే కనిపించకపోతే జీవితం అంధకార మవుతుంది. ప్రఖ్యాత రచయిత హెలెన్ కెల్లర్ మాటల్లో చెప్పాలంటే నాకు దేవుడు మూడు రోజులు కంటి చూపును ప్రసాదిస్తే చాలు మీరు ఎవరు జీవితంలో చూడలేనివి నేను మూడు రోజుల్లో చూస్తానన్నారు. 'ఐస్ ఆర్ విండోస్ ఆఫ్ ద సోల్' కళ్లు తెరిస్తే ప్రపంచం మనముందుంటుంది, ఆ కళ్లే మూసుకుంటే అంతా అంధకారమే. పార్వతీపురం మన్యం జిల్లాలోని 37 పీహెచ్‌సీల్లో నేత్ర వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నారు. నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం.

అధిక ఉష్ణోగ్రతలు ప్రమాదం

వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు ఉష్ణోగ్రతలు పెరిగి ఆవేడికి కన్ను పొడిబారి కంటి సమస్యలు ఏర్పడి చూపు కోల్పోయి అంధత్వానికి దారి తీస్తుంది. మనిషి నిమిషానికి ఎనిమిది సార్లు కంటి రెప్పలు ఆర్పుతూ ఉంటాడు. అలా చేయడం ద్వారా కార్నియాకు (నల్లగుడ్డు) అవసరమైన నీరు చేరి కళ్లు ఎండిపోకుండా చేస్తుంది. ఈ కాలంలో ప్రయాణిస్తున్న వారికి వేడిగాలుల దృష్ట్యా తడి ఆరిపోయి కంటిలో లూబ్రికేటింగ్ (సరళత) తగ్గి దురద పెరిగి చూపుడు సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది. వేసవి ప్రయాణంలో కంటి రెప్పలు నిమిషానికి రెండు నుంచి మూడుసార్లు మాత్రమే కొట్టుకుంటూన్నాయని ఒక సర్వేలో వెల్లడించారు. దీని ఫలితంగా కంటి సమస్యలు వచ్చి చూపు తగ్గే అవకాశం, తీవ్రమైన తలనొప్పి వచ్చే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి.

నేడు జిల్లా వ్యాప్తంగా శిబిరాలు

ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత నేత్ర వైద్య సేవలు అందించేందుకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఆరోగ్య సురక్ష కంటి వెలుగు కార్య క్రమంలో బాగంగా గ్రామాలలో గతంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేసి కేటరాక్ట్(అంతర కుసుమం) టేరిజియం(కొయ్యకండ) గుర్తించాం. జిల్లా ఆస్పత్రి నేత్ర వైద్య విభాగంలో రోజువారీ నేత్ర పరీక్షల్లో శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన వారికి ఉచితంగా ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిర్వహిస్తున్నాం.

–డాక్టర్. నగేష్ రెడ్డి, జిల్లా అంధత్వ నివారణ అధికారి

పూర్తి పరీక్ష చేయించుకోవడం ఉత్తమం

గ్లకోమాను కనుగొనడానికి కంటి వైద్యుడితో పూర్తి పరీక్షలు చేయించు కోవడం ఉత్తమమార్గం. సంపూర్ణ కంటి పరీక్షలో కంటి ఒత్తిడి (ఐఓపి) కొలత, కంటి డ్రైనేజ్ ప్రక్రియ,ఆప్టిక్ నరాన్ని పరీక్షించడం, కంటి విజువల్ ఫీల్డ్ పరీక్షల ద్వారా కంటి చూపును పరిశీలించి గ్లకోమాను గుర్తిస్తారు.

గ్లకోమాకు చికిత్స

ఈ వ్యాధి వచ్చినట్లు గుర్తించిన వెంటనే కంటి ఒత్తిడిని తగ్గించడమే దీనికి ప్రధాన చికిత్స. దీర్ఘకాలిక నియంత్రణకు కంటి చుక్కల మందు, మాత్రల వాడకం చాలా ముఖ్యం. కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్స కూడా చేయవలసి వస్తుంది. క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలి. గ్లకోమాను ముందుగా పసిగడితే వైద్యం ద్వారా కళ్లను కాపాడుకోవచ్చని కంటి వెలుగు నేత్ర వైద్య అధికారి డా.నగేష్ రెడ్డి తెలిపారు.

పొడిబారిన కన్ను లక్షణాలు

వెలుతురులో కళ్లు స్పష్టంగా కనబడకుండా ఉండడం నిలువుగా ఉన్న వస్తువులు, వైర్లు, గీతలు వంగినట్లుగా కనిపించడం, కళ్లముందు ఉన్న ప్రదేశంలో చుక్కలుగా కనిపించడం, ఒకే వస్తువు రెండుగా కనిపించడం, దీపం గాని బల్బ్ గాని దాని చుట్టూ ఇంద్రధనుస్సులాగా రంగులు కనిపించడం , కంప్యూటర్‌పై పనిచేస్తున్న వారికి తీవ్రంగా తలనొప్పి, కళ్లు తిరగడం, దురద, మంట, నీరు కారడం తదితర లక్షణాలుంటే వెంటనే నేత్ర వైద్యులని సంప్రదించి తగు చికిత్స పొందుతూ కంటి చూపు కాపాడుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

వేసవి కాలంలో ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా కళ్లజోళ్లు ధరించాలి. ప్రయాణంలో సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి. కంప్యూటర్ వద్ద గంటల కొద్దీ గడపరాదు.కంటి రెప్పలు ఎక్కువ సార్లు కొట్టుకొనే విధంగా ప్రయత్నించాలి. తరచూ ముఖాన్ని చల్లని నీటితో కడుక్కునే ప్రయత్నం చేయాలి. కంటికి దురదలు వచ్చే సమయంలో చేతితో నలపరాదు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ కళ్లపై అత్యంత శ్రద్ధ వహించి కంటికి ఎక్కువ వేడి తగలకుండా కళ్లజోళ్లు ధరించి చూపు కాపాడు కోవాలి.